బ్రాహ్మణాగ్రహారం

పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

"ఎవరు వారు ?"

"నేను కోంమ్రశౌతిని చయనులుబాబయ్యలా వుంది "

"అవునురా నాయనా! అంతా క్షేమంగా వున్నారా ?"

"నీఆశీర్వచనం నువ్వు కులాసాగా వచ్చావా ?"

"జిజ్ఞున చీవలేమురా యీమాటు "

"చాలారోజులికి వచ్చావు ఫాల్గునంలోకామా— "

"అవునవును. పదిమాసా లయింది."

"వెళ్లినపని తృప్తిగా—"

"తృప్తన్న తృప్తా ? కురిసి పోయాయిరా రూపాయలు చెట్టు దులిపినట్లే మహామంచిసంపాదన జరిగిందిరా యీప్రయాణంలోను."

"పునహాసతారాలు వెళ్లి ను వ్వెప్పుడూ తక్కువ తేలేదు, కాని నిలవమాత్రం చేశావుకాదు."

"దానికిగ్గోసిన నిలవ. డబ్బా ప్రధానం దర్జాకానీ. . ఇంతకీ; మనిషిని ధనం నిలవచేస్తుందా, ధనాన్ని మనిషి నిలవ చేస్తాడా ?"

"అదీ నిజమే "

"ఇంకేం మరీ ? ఎప్పుడు కావాలంటే అప్పుడే అవుతుంది సంపాదించేవాడికి నిలవ పిడికిలి గట్టిగా బిగిస్తేసరి."

"తలుచుకుంటే నువ్వు నినుపాలమీద వేలు నిలవచేస్తావు "

"అవునుగదా ? .. కాని చిఫులగామిగాణ్ణి మట్టంచేసీదాకా నిలవచెయ్యడంమాట తీసెయ్యి నాదగ్గిర "

"నీపట్టుదల మహాచెడ్డది బాబయ్యా!"

"కాకపోతే వాణ్ణిక బతకనిస్తానుట్రా నేనూ!"

"నీకు కోపంవస్తే అంతే."

"నేను దేశంలోనే లేనుకదా అని కిలకిల్లాడుతున్నాడు. కామోసునేం వాడు?"

"ఇంకేనా శాంతించవూ పెద్దబాబయ్యా ?"

"శాంతించమంటావా ? శాంతించేపనే చేశాడా వాడూ ?"

" . .   . . .. "

"నాఅంతర మేం, తనఅంతర మేం ? నిండుసభలో తీసి పారేస్తాడా నన్ను ? రెండోతాంబూలం యిప్పించడూ నాకూ ?"

"నిజానికి వాడు తొందరపడ్డాడు; కానీ—"

"ఇక కానీయెందుకూ మరీ?.. ...తోటపంపుతనఖా అయిపోయింది కదా ? కొంపవేలంవెయ్యడమే తరవాయిగదా ? ఇకరంగసానిబాడవా ? చూస్తూవుండు, ఈ దెబ్బతో అది క్రియమే."

"నువ్వు తలుచుకున్నావంటే —"

"తిండికేనా సరిపడ్డ ధాన్యం రావుకదా నామీద కక్షుకడతాడా ?"

" .   . . . "

"నాతో విరోధపడ్డాకేనా వాడికి దిగతీత ప్రారంభం ?"

"అవును."

"అజ్ఞానం వుండాలా అక్కర్లేదా ? దీపంమీద పడ్డ శలభంలాగ మాడిపోవాలి; గాని నాతోపోరి—"

"ఇప్పటికేనా వాడికి బుద్ధిరావలసింది."

"ఇంకా యేమేనా వాగుతున్నాడా యేమిటి?"

"వాడి మాటకి జమేమిటి, పద్దేమిటి పోనిస్తు బాబయ్యా!"

"అయినా సంగతేమిటో కాస్త చెబుదూ వోరే!"

"చెప్పేదేమిటి పదిమాట్లు? ఎవరికి తెలవందేవుందీ?"

"తిరుగుతున్నాడా యేమిటి?"

".. . . . . "

"కవిత్వం అల్లుతున్నాడా? ఆమధ్య ఛందస్సేడి కాడుకామూ భట్రాజుదగ్గిర?"

"వాడీమొఖం. కవిత్వమే?"

"మరేమిటో?"

"ఇక మూడోతాంబూలంకూడా ఇప్పించకుట నీకు"

"ఏమో?"---

"రెండుతాంబూలాలు మొదట కర్మజ్యేష్ఠులికి వెళుతున్నాయి కనక యిక మూడోతాంబూలం విద్యాధికుడికి వెళ్లడం ధర్మమట"

"అలాగేం?"

"చాలాబింకంగానే చెబుతున్నాడు కభుర్లు"

"ఆ?"

"ఇంతకీ కొంపెల్ల వెంకప్ప వాడితో కలిశాడు నువ్వు వెళ్లిన నెల్లాళ్లకి."

"బాగుంది .. .. ఇది వాడి పురమాయింపే అనుకుంటాను."

"ఇద్దరూ వొక్కమాటమీద___"

"జోగీ జోగీ రాసుకుంటే బూడిదరాలిందిట."

"మహాబాగా చెప్పావు"

"వెంకప్పగాడి బతుకు మనచేతిలో వుంది"

"ఎలాగా?"

"వాడు బొడ్డుపెరుమాళ్లుశెట్టికి యెనిమిదివందలికి నోటు రాశాడు, యెరుగుదువా?"

"రేండేళ్లు దాటింది."

"శెట్టి యెన్నిమాట్లడిగినా "యిదిగో", "అదిగో" అంటూ వచ్చాడుగాని దమ్మిడీఅయినా వసూలుపెట్టలేదు"

"అయితే?"

"శెట్టి యిక ఆగడు"

"దావా___"

"సగంఫాయిదా యిస్తే నోటు నాకు ట్రాన్సుఫరుచేస్తానన్నాడు శెట్టి."

"అదెప్పుడు?"

"ఇక నెల్లాళ్లకి నేను వెళతా ననగానూ"

"ఇక పొలమూ, కొంపాకూడా జప్తన్నమాటే."

"ఇక చూసుకో నాప్రతాపం"

"ఇంతకీ జమ యేమాత్రం బాబయ్యా?"

"అంచనాకట్టు"

"సహస్రం."

"ఛా! ఎప్పుడూ లేదూ"

"రెండు___"

"దాన్ని రెండింట గుణించు."

"అబ్బా!"

"ఏమనుకున్నావు మరి?"

"అయితే రామదీక్షితులూ, వెంకప్పా చచ్చారన్నమాటే."

"వెధవల్ని తిప్పితిప్పి కొడతానుచూస్తూవుండు నువ్వు నాలోవాడవేనా?"

"నాలోవాడవేనాఅంటే నాసంసారంసంగతి నువ్వెరగంది కాదు ఏరోజున అర్థరూపాయి లేకపోతే ఆరోజున___"

"ఏమంటావు?"

"నాదారిని నన్ను పోనియ్యి"

"నువ్వు దివాన్గిరీ బాగా చేస్తావు. నువ్వు నాపక్షంలో వుంటే తక్కిన నాపనులు ఆగిపోవు"

"నేను పూనుకోవడమే వస్తే ప్రాణం యిచ్చెయ్యాలసిందే, వెధవకృత్రిమం నాచేతకాదు బాబయ్యా!"

"అందుకోసమే___వొక్కకాగితం పారేస్తాను, పుచ్చుకో"

". .."

"ఏమంటావు?"

" .. .. "

"ఆలోచించుకో."

" .. ... "

"ఎన్నిపెళ్లిళ్లూ వొడుగులూ చేయిస్తే రానూ వంద రూపాయలు ఇంతకీ! నీ కెన్ని ఆశ్రమాలుండినా యేడాది కెన్ని శుభకార్యాలు తగులుతాయీ పెద్దపీ?"

" .. .."

"భయపడకు."

"కొడతారనీ, తిడతారనీనా?"

"నే నేం తక్కువచెప్పలేదు మూడుపుట్ల ధాన్యం అన్న మాట."

" . ."

"గాది బాగుచేయించుకో"

"అలా అన్నావా?"

"అంతే అనుకోకు యీ ఖైచాపులు అసమానమైనవి దొరికాయి. నాలుగు—అరడజ నిచ్చేస్తాను, దర్జాగా కట్టుకో"

" .. ."

"నీకొడుక్కికూడా బట్టలూ, పుస్తకాలూ యిచ్చేస్తా నీయేటికి ఏం?"

"నువ్వు పేరుపేరువరసని యింటిల్లపాదికీ—"

"ఇక కోడలికిమాత్రం బంతిలో బాలపత్రుంచెయ్యడం యెందుకూ? వొకపునహాచీర దానిక్కూడా పట్టుకుపో."

"మాఅత్తారేనా యెప్పుడూ యిలాగ సంతోషపెట్టలేదు—"

"వాళ్లమొఖం ఏమంటావు మరీ?"

"ఇక తప్పుతుందా?"

"ధీమాగా చెప్పావుకాదు."

"పనిచెయ్యాలా, మాటచెప్పాలా ధీమాగా?"

"అయితే సరే. మధ్యాహ్నం కనపడతావుకాదూ?"

"రాయవరం వెళ్లాలి వొకక్షణం వుండి. అక్కడ నవగ్రహశాంతి-అర్ధరూపాయేనా ముట్టుతుంగి"

"పోనియ్యకు"

"పున్నానికి బియ్యం అయిపోతాయంటోంది నీకోడలు."

"రేపే కొలిపించేస్తాను ధాన్యం, కొలగాడితో చెప్పి. వాయిగావేస్తా ననుకున్నావా యేమిటి?"

"అబ్బే నువ్వు దాటేస్తావనా?"

"మరి వెళ్లు సాయంత్రం—"

"తప్పకుండానూ"

"గప్‌చిప్"

"వేరే చెప్పాలా?"

"అయితే. ఎవ్వాళ్లో వున్నట్టేనా?"

"ఎవరూ? ఆ! ఆ! నిన్న పొద్దున్నే వచ్చింది మేళానికి వెళ్లి. దండిగానే లాక్కొచ్చిందిట యీమాటు కోనసీమ దోచేసిందని చెప్పుకుంటున్నారు"

"అసాధ్యురాలురా అదీ........నేనుకనక లొంగి నమ్మకంగా పడివుంది."

"అవునవును. రామదీక్షితుల్ని నోరెత్తాటప్పటికి విసిరికొట్టింది, మరిచిపోతానా?"

"ఆపరాభవం చాలదుట్రా వాడికీ? నీలాచలాన్నలా నిలపగలిగేడా వాడూ? నన్ను చూసిందంటే కుక్కఅయిపోదూ అదీ?"

"నీచేతికి యెముక లేదుకనక."

"చూడూ, పాకేసీచోట పారెయ్యాలి. వొక్కమాసం తిరిగానంటే సానికి సంవత్సరంపోషణ. లేకపోతే మర్యాదా నిలుపుకోగలమూ?"

"నీశక్తి అలాంటిదే మరి తోటలోకి వెళ్లి చక్కా వస్తాను."

"పద. పోనియ్యరా కుర్రాడా బండి. పెద్దవీథికే పోనియ్యి, కరణంగారి యింటిదగ్గిర మళ్లించవచ్చు. చూడూ. వూళ్లోకి వెళ్లాక గాలప్పరుగుమీద వెళ్లాలి గుర్రం. తెలిసిందా?"

౨

"ఏమట్టుకి వచ్చిందిరా కథా?"

"ఏమట్టుకయితే యేం? నేనేమో తప్పకుండా నెగ్గేస్తాను; కాని మూడురోజులకిందట వూరికి వెళ్లింది"

"ఏవూరూ?"

"రామేశ్వరం."

"ఏమిటీ?"

"అదే వచ్చింది చిక్కు."

"చక్రం అడ్డుపడెయ్యలేకపోయావా?"

"కుదిరిందికాదు."

"ఇక ముందుమాట యేమిటి?"

"నేనూ అదే ఆలోచిస్తున్నాను"

"పోనీ, యిదేఅన్నమాట యేమిటి? మరోటి చూడూ."

"తీరా, ఫలోన్ముఖం అయినాక యీస్వల్పకారణంకోసం విడిచిపెట్టనా? చేదాయేమిటి? మీరంతా వుండనేవున్నారుకదా మార్గదర్శకులు?"

"మాలాగే వుండాలా నువ్వూనూ? అయినా అంతఅశ్రద్ధగా యెందుకున్నావూ?"

"అశ్రద్ధకాదు వ్యవహారం అంతా వడీదుడుగ్గా వచ్చేసింది."

"ఏమిటదీ?"

"అసలు రామేశ్వరంయాత్ర హఠాత్తుగా—అంటే, సూచనేనా లేకుండా తటస్థించింది. సోమిదేవి మేనత్త తనకూతుర్ని తీసుకు వెడుతూ దీన్నికూడా తంపిస్తారేమో అని శనిగ్రహంలాగ వచ్చి

ఘడింది. దానితో సోమిదేవి యెంత మొత్తుకున్నా భీమన్నశాస్త్రులు మాకు పదపదమంటూ పడగొంచేశాడు."

"ఇంకా యిరవై సంవత్సరాలేనా నిండాయో లేదో, అప్పుడే యీపుట్టిమునక యేమిట్రా ?"

"మనమతం వోత్తి వెధవమతంరా జుట్టుతీసేస్తేమాత్రం గుణం మారుతుందా యేమిటి ?"

"మరి మీచెల్లెలికి—"

"మంచో చెడ్డో అది పదోనాడే అయిపోయిందికదూ ?"

"అదో కప్పదాటు.. . సరే, తరవాత ?"

"ఎలాగేనా తప్పించేద్దామని రెండురోజులు మహాతిరిగాను; కాని మాట్లాడ్డానికే వీలయిందికాదు "

"ఏం ?"

"ఎప్పుడు వెళ్లినా సుందరంగాడు వాకట్లో కూచునివుండే వాడు యములాడిలాగ "

"అదేమిటి ?"

"శాకుంతలం పాఠం మొదలుపెట్టాడురా వాడు భీమన్న మామదగ్గిరా."

"వుద్దేశం యేమిటో ?"

"ముప్ఫయ్యేళ్లు దాటాయిగదా నీకింకా చదువేమిట్రా అని నేనడగ్గా, "సర్వేశ్వరుడి దయవల్ల భుక్తికి లోటు లేకుండా పోయిందిగదా, చదువుకోక యింకేం చెయ్యనూ" అన్నాడు "

"అంతేనా ?"

"అంటే ?"

"నీకు పోటీ—"

"ఛఛా ! నల్లమద్దిమొద్దులాగ కారునలుపూ వాడూ—లాటరీలో పదివేలు రావడంతోటే అందగాడయిపోయాడా యేమిట్రా వాడూ ?"

"నలుపైనా వాడి కళ్లల్లో మాంచి తేజస్సూ, ఆకర్షణశక్తి వున్నాయిరా. పైగా నోరువిప్పాడంటే చకచకచక—కిన్నెరలు మోగుతూ ఆకంఠమూ, ఆరాగవరసా—ప్రస్తావన మొదలుపెట్టాడంటే వొకటేధోరణికదా గంటలకొద్దీని ? మధ్యమధ్య శ్లోకాలు విడిచిపెడుతూ, చేతులు తిప్పుకుంటూ—అసలు వాడు మాట్లాడితేనే నవరసాలూ వొలికిపోతాయి అందుచేతే యెక్కడికి వెళ్లినా పెద్దపెద్ద పండితులతో సరిగ్గా వాడికి సత్కారాలు జరుగుతున్నాయి."

"ఆసత్కారాలకీ, దీనికీ సమ్మంధం యేమిటోయ్ ?"

"అలా అనకు అమ్మాణ్ణి చూశావా యెలా యెదిరిస్తోందో వాడికి ?"

"అదో పిచ్చిముండ "

"వాణ్ణిచూస్తే చాలామంది ఆడాళ్లు పిచ్చిముండలైపోతారు "

"అయినా సోమిదేవిదగ్గిరమాత్రం ఆమాట తీసెయ్యి దాని మనస్సు నామీదే పూర్తిగా లగ్నం అయిపోయింది ఇక ఆరుమూడైనా అది తిరిగిపోదు అసలు దాని మనస్సు కదిపినవాణ్ణి నేనే కనక చలించినవెంటనే నామీదే పడిపోయింది దానిమాపు "

"ఎప్పుడేనా—వొక ముద్దేనా ?"

"ఇంకా లేదు—కాని అది నాసొత్తే "

"బాగా నమ్మకమే ?"

"ఇటు సూర్యుడటు పొడిచినా తిరిగిపోదిక."

"సరేమరీ నీ కంతధైర్యం వుంటే నేను కాదంటానా ? కాని సుందరానికి పెళ్లయింది సుమా!"

"ఏమిట్రో ?"

"ఇప్పుడే తెలిసింది నాకు."

"ఎప్పుడు, ఎక్కడ ?"

"నిన్నకాక మొన్న సాయంత్రం, చెన్నపట్నంలో "

"తణుకోయి మాచారం అన్నట్లదేమిట్రా ?"

"అదో గమ్మత్తు "

"పిల్ల నిచ్చిన అభాగ్యుడెవర్రా ?"

"ఇవ్వడమూ, పుచ్చుకోడమూ కాదు, కోరడమూ అంగీకరించడమూనూ "

"అంటే ?"

"స్వయంవరం అన్నమాట "

"అంత యేబ్రాసిపిల్ల—"

"పిల్లంటే పిల్లకాదు మాంచి ముమ్మరంలో వుంది "

"నెధవముండా యేమిట్రా ?"

"సరిగ్గా కనిపెట్టావ్ "

"చెన్నపట్నంలో అయితే రాయవరం కృష్ణయాజులు గారి అల్లుడు చేసివుంటాడు "

"అదీ అంతే తేడా లేదు. కానీ—"

"ఇంకేమిటి ?"

"పెళ్లిమట్టుకే ఆయన చేశారు "

"బోధపడలేదు "

"మాకు పెళ్లిచెయ్యండంటూ పెళ్లికొడుకూ, పెళ్లికూతురూ వెళ్లి కోరేదాకా ఆయన యిదేమీ యెరగరు."

" .... "

" వులిక్కిపడ్డావేం ? "

" ఏమీ లేదు.. అయితే— "

" ఆంధ్రపత్రికలో దంపతుల ఫోటోకూడా పడింది .. చూడు "

" పేర్లు మూసేస్తావేం ? "

" పెళ్లికూతు రెవరో కనిపెట్టూ, చూస్తాను "

" .. ఎక్కడో చూసినట్టుంది.మన ప్రాంతమే అనుకుంటాను "

" బాగా పరకాయించు "

" రామచంద్రపురంలో చూశా నిలాంటి మనిషిని. అయితే ఆమనిషి రాచది, కాని వెధవముండల్ని పెళ్లాడేవాళ్లకి జాతిభేదం అక్కర్లేదేమో "

" అదంతా నీకెందుకోయ్ ? "

" అయితే యిది చూసిన మనిషిమాత్రం— "

" మాట్లాడిన మనిషికూడా— "

" ఆ! ఆ! ఆసి రంకుముండా! సోమిరా "

" ఈమాటు చదువుకో కిందవున్న విషయం "

" .. . . ఎంతపని చేసిందిరా దంమముండా ? "

" తిట్టకు "

" తిట్టాలా, పాతిపెట్టాలా ? నన్ను దగాచెస్తుందా ? "

" అదేమీ చెయ్యలేదు నిన్ను. "

" నన్నే కాదు, యింకా యెందర్ని మోసంచేసిందో యిలాగ. లేకపోతే మళ్లీ పెళ్లాడ్డానికి సిధపడగలదా ? "

" ఇప్పుడేకాదుట్రా మహాపతివ్రత అన్నావూ ? "

" ఎవడిమట్టుకి వాడికే పతివ్రత ; కాని సుందరంగాడి పని పట్టాలి ఎంతపని చేశాడూ పాడువెధవా ? "

" ఏంచేస్తా వేమిటి ? "

" బోలెడుసొమ్ముతోటీ, వొంటెడు నగలతోటీ లేవతీసుకు పోయాడని భీమన్నమామచేత ఛార్జీ తగిలిపిస్తాను. ముందు వాళ్లిద్దరికీ అరదండాలు వేయిస్తాను మూడునిమిషాలలో. "

" లాభం లేదు, వూరుకో. "

" నువ్వూరుకో. నా కడ్డువస్తావా ఫాజీ ? "

" లేవకు, నామాట విను వా డేమీ చెయ్యలేదు నిన్ను. "

" అది కోరితేమాత్రం ? గ్రాండంతా నేను ప్రిపేరుచెయ్యగా మధ్యవచ్చి వాడు తన్నుకుపోతాడా ? "

" బాగుంది వాదం ! "

" ముందు పత్రిక యిలాతే. "

" వుండు వుళ్లాక్కోకు. పత్రిక యెందుకూ ? "

" భీమన్నమామకి చూపించాలి "

" గుమ్మంలోకి వెళ్లావంటే మొగమ్మీద—తెలిసిందా ? "

" ఏం ? "

" సోమిదేవి అతనికి వుత్తరం రాసింది "

" ఆ ? "

" నువ్వు చేసిన కుట్రఅంతా రాసేసింది. నువ్వు చెరపడానికి సిద్ధపడ్డావుట సుందరాన్ని తానే కోరగా పెళ్లిచేసుకుంటే వొప్పుకుంటాననాట్ట వాడు వా డామాట అన్నాక నీబుద్ధి అంతా బోధపడిందిట దానికి. మద్రాసుస్టేషన్లో తాను జట్టులోనుంచి తప్పించుకుపోవడమూ, సుందరం ఆబండిలోనే జట్టువాళ్లకి తెలవకుండా రావడమూ, తనజట్టువాళ్లు బళ్లు కుదుర్చుకొంటూవుండగా తానూ, సుందరమూ మోటారెక్కి యెగిరిపోవడమూ, సుందరం అదివరకే రాసివుండడంవల్ల కృష్ణయాజులుగారి అల్లుడు ఆసాయం త్రమే తమకి పెళ్లిచేసెయ్యడమూ—అంతా పూసగుచ్చినట్టు రాసేసింది "

" దానిల్లు వల్లకాడు— "

" అదేం కర్మం ? ఇక దానిల్లు నోసతోట అయి కలకల్లాడుతూవుంటుంది "

" అదీ వొకబతుకే ! "

" బుద్ధి చలించాక అదే నయం "

" అయితే నువ్వుకూడా కానియ్యవోయ్ ! "

" అది తరవాత ఆలోచించుకుందాం. "

" అయినా నే నూరుకోను. వాళ్లని సుఖపడనివ్వను నేను. "

" వాళ్లకి పెద్దపెద్దల ఆసరా వుంది. ఎగిసెగిసిపడకు. "

" ఏంచెయ్యమంటావురా మరి ? "

" కిక్కురుమనకు ఏమీ యెరగనట్లు— "

" సిద్ధాన్నం తన్నేశాడురా ఛండాలుడు. "

" పెట్టిపుట్టాడు వాడు. ఇప్పటిదాకా పెళ్లికాకపోయినా చివరికి నిక్షేపమూ, నిక్షేపంలాంటి పెళ్లామూ— "

" పోతూపోతూ నాకూడా బిగించిందిరా దంమముండవురీ ! "

" కనక చప్పచప్పగా వూరుకో. శాస్త్రిల్లుమామ కదిపితే " అదే నన్ను కోరింది " అని బుకాయించు "

" నమ్ముతాడా ? "

" అయితే సెల్లాళ్లు వూళ్లో వుండకు. "

"ఎక్కడికి పోనురా ?"

"మండపేట వుండానేవుందికదూ ?"

౩

"కొప్పవరంనుంచి కబురు వచ్చిందా ?"

"ఇప్పుడిప్పుడే మురుకాల్వ దాటతా డీపాటికి గుమాస్తా"

"నీమాట పంతులుగారితో నిన్న చాలాదూరం చెప్పాను. నాతోపాటు నలుగురికే ముట్టచెప్పించాలని చూస్తానుగాని నామట్టుకే చూసుకోను నేను"

"నంచునే మాట్లాడుతున్నావు"

"స్నానాని కిప్పటికే అలస్యం అయిపోయింది అల్లుడు కూడా వచ్చాడు రాకరాకా"

".వొక్కక్షణం."

" ..... చాపెందుకోయ్ ?"

"వుందికాదూ ?"

"...... .. .."

"అయితే యెవరెవరి కేర్పరిచావు ?"

"నాకు, నీకు, సీతాపతిశాస్త్రికి, సుబ్బావధానికి, రామభద్రయ్యనులికి—"

"మొన్ననే నాలుగువేలు కొట్టుకువచ్చాడుగదా—"

"అలాకాదు. వాణ్ణికూడా కట్టుకోకపోతే చిక్కులున్నాయి. వాడు నోరుగలవాడు. డబ్బుబత్కృ్యం లేదు. చేతిలో లేకపోతే నిమిషంలో సంపాదిస్తాడు. పైగా అధికారిప్రాపకం వున్నవాడు."

"నువ్వు కొంచెం లౌక్యం—"

"ఇంతకీ పెద్దకూతుర్ని మక్కాప్రయాణం తప్పించి రామేశ్వరం తీసుకువెళ్లినందుకు వాడిమీద పంతులుగారికి చాలావిశ్వాసం వుంది కూడాను. పదిమాట్లు చెప్పారు ఆయన వాడిమాట."

"అప్పుడు చేదుమేశాడా యేమిటి వాడు ?"

"వచ్చేచోట నువ్వుమాత్రం వొదులుకుంటావా యేమిటి?"

"నామాట కేంగాని, రామదీక్షితులు వొప్పుకో డనుకుంటాను."

"కుర్రకుంక, వాడి కేం తెలుసునోయ్, వ్యవహారాలూ?"

"ఇంతకీ: నూరేసే యేర్పరిచా వేం?"

"అక్కడికే యెక్కువ. సీమవెళ్లా డన్నమాటేగాని సుబ్బారావు కేమేసాలంటిం దనుకున్నావా యేమిటి ! బారిష్ట రనిపించుకున్నాడు. అంతే. నోరూ వాయీ లేదు. వొక్కకేసు నడపగలడని తోచదు."

"దానితో మనకి పనిలేదు కాదూ?"

"నిజమే తాలూకామొత్తంమీద సనాతన ధర్మసభకి ప్రెసిడెంటుగా వున్నారు; కనకగాని లేకపోతే రామచంద్రుడుగారు మాత్రం సిద్ధపడతారా యేమిటి కొడుక్కి ప్రాయశ్చిత్తం చేయించడానికి? సుబ్బారావయినా తండ్రి కెదురుచెప్పలేక తల వూపాడు; గాని యిది కాస్తా అయిపోయినతరవాత—అవేమిటీ స్టేషన్లో వుంటాయీ? వాట్లలో అయినవీ, కానివీ తినడం మానతాడాయేమిటి రుచిపడ్డాక? మన మామోతాదు గ్రహించవద్దూ? పైగా మనకే ఐదువంద లయినాయి సంతర్పణకీ, సంభావనకీ మరో మూడువందలేనా కావాలి. ఆపైని చిల్లర లుంటాయి లౌక్యులికి కాఫీలూ అవీకూడా పోస్తారుట సాయంత్రం హరికథా, రాత్రి కొల్లవేషమూ కూడానుట. మొత్తానికి సంచీ పూర్తి అవుతుంది"

"సరే మరీ వచ్చేదుంటే నువ్వుమాత్రం పోనిస్తావా యేమిటి ? దీనితో పిబ్రవరికి స్త్రీ చెల్లిపోతుంది కదా?"

"వెంకుసోదెమ్మ చెల్లిస్తుందిలే మార్చికి స్త్రీ. బెంగపెట్టుకోకు"

"అదికూడా సిద్ధమన్నమాటే?"

"సిద్ధంఅంటే ద్వాదశినా డయిపోవాలి. ఏకాదశివుపవాసమూ ద్వాదశిపారాయణా—అన్నీ కలిసిరావద్దూ? కొడుక్కి శేషావధాని కూతుర్ని చేరమాడుతోంది వాడుకూడా మొగ్గుతున్నాడు అంచు చేతే తలోవందా యివ్వడానికి వొప్పుకుంటోం దది."

"శేషిగాడు మొగ్గుతున్నాడంటే ఆశ్చర్యమా? యాభైవేలున్నాయి ముండదగ్గిర. కానిపనిచేస్తేమాత్రం దానికేం పోయిందీ? మేమమ్మా మహామహా చదివేశామని విర్రవీగుతున్నాము; గాని మనలో వొక్కడిదగ్గిరా పదివేలేనా లేవు"

"మన దేవతార్చనలే వనకి ఆస్తి అవి లేకపోతే మనల్ని చూసేవా రెవరోయ్ ?"

"అదీ నిజమే; కాని దేవతార్చనవంట తాను చేస్తానంటుందేమో వెంకుసోదెమ్మ ?"

"అది తప్పదు లేకపోతే దాని కేంలాభం ? మనం స్వయంపాకాలు చేసుకోడానికా యేమిటి అయిదువందలూ, పైఖర్చులూ—"

"దిక్కుమాలినముండ రంగూనుకూడా తగులడిందని చెప్పుకుంటారుగదా, చూస్తూచూస్తూ మాలకూడు తినమా ?"

"ఇక అదంతా కట్టిపెట్టు. పంచగవ్యప్రాశన చేశాక—మంత్రాలికి శక్తి వుందంటావా లేదంటావా ?"

"లేకపోతే అయిన నూరేసీ కరుకులు గుమ్మరించి మనల్ని బతిమాలుకోడం యెలా వస్తుందీ ? "

" ఇంకేం ? ఇంతకీ శంకరాచార్యపీఠం మూలపడిందీకనక సరిపోయిందిగాని లేకపోతే మనకేంవుందీ? నాలుగేసి రూపాయలతో తృప్తి— "

" అవునవును. "

" లోకం యెలా వుందో మనం కొంచెంచూసుకుంటూ వుండాలి బిగించనూకూడదు; విడిచిపెట్టనూకూడదూ. పదిరూపాయలు చేతిలో పడే వుపాయమే ముఖ్యంగా చూసుకోవాలి. "

" శాస్త్రంమాత్రం యేం చెబుతోందీ? శాస్త్రంలో వున్న బండారం అంతా ప్రాయశ్చిత్తాలే కాదూ ? "

" అదిగదీ మాట చాంద్రాయిణం చేస్తే అన్నిపాపాలు చెల్లూ. చాంద్రాయణం అంటే ? "

" మనకి తలోశంథా— "

" అంతే అంతే. "విత్తశాఠ్యం నకారయే" త్తనికాదూ కారికా ? ఎంతచెట్టు కంతగాలి అన్నట్లు నడిపించాలి మనం "

" అవును.. అయితే సుబ్బలక్ష్మి రామభద్రచయన్లులు వెనక్కాల తిరుగుతోందిట యేమిటోయ్ ? "

" నిజమే ప్రస్తుతం తోడికోడలు తెచ్చినమనోవర్తిదావాలో పనిచేసపెట్టమనిమాత్రమే కాకపోయినా, ముప్ఫయ్యేళ్ల పీనుగు. పీదోయేడుస్తుంది పోనిద్దూ "

" వూరంతా చుట్టబెట్టీలా వున్నాడు వాడు. "

" పోనీ తోడికోడలిపక్షం నువ్వు కాసుకో "

" నా కక్కర్లేదుసుమా, నన్నిలా పోనియ్యి. "

" రామసోదెమ్మే చాలు నీకు. "

" పొమ్మంటే యెన్నివిధాల గెంటినా విడవనంటుం దది ఖలవంతాన పొమ్మనడానికే మనస్సొప్పడంలేదు నాకూ పాపం మాట లనుకోగూడదు అడుగంటిపోయేసమయంలో నన్ను లేవతీసిం దదే. విశ్వాసం అంటే దానిదేచెప్పాలి "

" పెట్టిపుట్టావు. .. రేపు సోమేశ్వరంలో సదస్యం నిశ్చయమేనా ? "

" చల్లపడేటప్పటికి కబురు వస్తుంది "

" తలోరూపాయీ— "

" అయిదుగురికీ పిల్లకాసులు- అయిదుగురికి కోనసీమచాపులు, పాతికమందికి రూపాయలు— "

" సెలగోసెలగ. అస లంతమంది పండితులేరోయ్ మన ప్రాంతంలోనూ ? అయితే కాసులు— "

" నీకూ నాకూ తప్పదు. "

" రామభద్రచయనుల్ని కూడా కలుపు. "

" ఏం ? "

" చెబుతాకాదూ. "

" వాడి కూతుర్ని నీమనవడికి— "

" అప్పుడే యెక్కడికి తీశావూ ? . ..నిశ్చయం కావాలిగదా ? "

" ఏమాత్రం ? "

" వెయ్యినూట పదహార్లిచ్చి వుభయఖర్చులూ పెట్టుకోడం. "

" పోనియ్యకు "

" జామార్లు కట్టుకోడం తరవాయి. రేపు దశమినాడు స్థిరపరిచాం "

" బాగుంది. "

" మరి వెడతా పదకొండుకాదూ ? "

" అదిగో . .. సరిగ్గా కొడుతోంది విన్నావా ? "

" మీరంతా సంపాదించారోయ్ తలోటినీ. నాకే శ్రద్ధలేకపోయింది "

" నువ్వు పాతికరూపాయలు మాలాగ గంగలో పోస్తావుటోయ్ ? "

" గంగలో పొయ్యడానికేంగాని—మరి పోతా. "

" పద. "

౪

" నువ్వు లక్షచెప్పు, కోటిచెప్పు, నేను మానను "

" నే నెందుకు చెబుతున్నానో కొంచెం ఆలోచించుకో. "

" మాచెల్లెలు వెధవ, రజస్వల అయినప్పుడు వాడుచేసిన అల్లరి మరిచిపోయావా ? తరవాత దానికి పెళ్లి అయిందనిపించాటప్పటికి నాగడ్డి నేను తిన్నానే ? "

" మీనాన్న వాణ్ణి తిప్పలుపెట్టాడు వాడు మిమ్మల్ని వీథిలో పెట్టాడు. "

" ఇంకేం ? ఈవిరోధం మాకు తరతరాలనుంచీ వస్తోన్నదే. నేను దాన్ని భంగపరచడం యెందుకూ ? "

" అలా కాదు. కాస్త పస్తాయించు. "

" బుద్ధిపూర్వకంగా కోడల్ని విషంపెట్టిచంపుతే వాడెక్కడో దేవుడంటూ నన్ను దిగతీస్తావేమిటోయ్ ? "

" సూతికవచ్చి చచ్చిపోతే విషంపెట్టాడంటా వేమిటి నువ్వూ ? రామచంద్రపురంనుంచి పెద్దడాక్టరు వచ్చి రెండురోజులుయింజెక్షన్లు కూడా చేసివుండగా ముందూ వెనకా చూడకుండా గంతులేస్తావేమిటీ ? కేసు నిలుస్తుందా ? "

"నిలిచీదాకా యెందుకూ? దహనం కాకుండా రెండుపూట లాపుచేస్తే చాలనూ వాడికి ప్రాయశ్చిత్తం?"

"నీమాటమీద మనసబు బకెరురాసి శవాన్ని అటకాయిస్తా డన్న నమ్మకం యేదీ?"

"లేకపోతే అతన్నిమాత్రం వదిలిపెడతానా నేనూ?"

"నువ్వే మొగాడవు వూళ్లోకల్లానూ ఇంకెవడికే యేమీ చేత కాదు, ఏం?"

"ఈవిషయంలోమాత్రం నా కడ్డులేదు."

"వాడిపక్షంలో రామభద్రచయనులుగా రున్నారు, తెలుసునా?"

"వుం-టే?"

"రేపీపాటికి నీసంగతి యింజెక్షన్లో పడిపోతుంది. యెగిసెగిసిపడకు."

"పారేస్తాను మరోచోట తెచ్చీ. ఆయనే మహా వడ్డీవ్యాపారం చేస్తున్నాడా యేమిటి?"

"అంత చులాగ్గా డబ్బుపుట్టేవాడవు నిన్నగాక మొన్న యెందుకు తిరగరాశావూ నోటూ?"

"విషమప్రశ్నలు వేసి నువ్వు చంపుతా వేమిట్రా నన్నూ?"

"నిన్ను చంపడంకాదిది, అనవసరపు గొడవల్లో మునిగి పోకుండా తేల్చడం."

"శవం యింకా అవతలికి వెళ్లకుండానే నీమాతుర్ని స్థిర పరుద్దా మనుకుంటున్నట్టున్నావు నువ్వు, ధోరణి చూడగానూ."

"పోనీ, నీకూతురికి మాట్లాడనా?"

"నాకు మరోసమ్మంధం దొరకదా యేమిటి?"

"నాకే దొరకగు పాపం! అవునా?"

"అయినా నన్ను విడిచిపెట్టేస్తూ."

"పట్టుకున్నానా యేమిటి? ఇక నీయిష్టం వచ్చినట్లు తంటాలుపడు. నడుంగా యీరొష్టంతా నాకెందుకూ?"

"నుంచో......వోరేయ్! మాట పూర్తికాకుండానే తారకం అంటితే యెలాగరా దానిల్లు వల్లకాడయితేనూ?"

"నేనవతలికి పోయినా తప్పే?"

"పోయి వూరుకుంటావా యేమిటి నువ్వు? పట్టామణీని తిరగదీస్తావు. మూడువేలివ్వాలి నీకతగాడు. నువ్వు కక్షెరచేస్తే కుంయి మనలేడు."

"రామభద్రచయనులుగారు యెదుట నిలవబడితే మహాపాడి చేస్తావుకాబోలు నువ్వు!"

"నాకు కడుపు మహామండిపోతోందిరా వాణ్ణి తలుచుకుంటేనూ. వొక్కమాటు బగులుతీర్చుకోనివ్వరా!"

"కానియ్యి. నీకడ్డేమిటి? నేను వెళ్లిపోతా నన్నానుగానూ?"

"అబ్బా! తడిగుడ్డతో గొంతుకోస్తావురా నువ్వూ!"

"నువ్వే మహాధర్మరాజవు. కదూ?"

"పోనీ, వాడప్పు డలా అల్లరిచెయ్యవచ్చునా?"

"చేశాడుకనకనే నువ్వు బదులుతీర్చుకోవా లనుకుంటున్నావు. అది వొకవిధంగా ధర్మమే; అయితే నువ్వు బదులుతీర్చుకోవాలంటే అవకాశం వుండాలా అక్కర్లేదా? వాడికోడ లిప్పుడు చచ్చిపోయిందంటే అందులో యేమేనా అనుమానాస్పదం వుందా? అలాంటికోడలు మళ్లీ దొరుకుతుందా వాడికి? అది పోయినందుకు ఇంటిల్లపాదీ యెంతగోలపెడుతున్నారో చూశావా నువ్వూ?"

"కనక తప్పకుండా అల్లరిచెయ్యాలి."

"కానియ్యమన్నానుగా నేనూ?"

"నవనాడులూ కుంగదీశావు, కానియ్యమంటున్నావు. కింద మంటపెడుతున్నావు, పైని నీళ్లు చల్లుతున్నావు."

"నీకంతకష్టంగా వుంటే—"

"నుంచో........పోనీ నావుక్రోషం పోయే వుపాయం చెప్పు."

"నేను చెప్పింది నీకు నచ్చదు."

"అయినా చూద్దాం.. ......"

"నీకిలాంటి కష్టం వచ్చిందా అని మనస్ఫూర్తిగా పరామర్శ చెయ్యి వాణ్ణి."

"చ-ప్ప-గా వుంది."

"జ్వరితుడికి పంచదార చేదు. పచ్చకామెర్లరోగికి జగత్తంతా పసుపు. అసలు నీజన్మ చప్పనిదీ. నీబుద్ధి చప్పనిదీ. నీహృదయం చప్పనిదీ—"

"ఇక నీదారిని నువ్వు వెళ్లు నాయనా! ఇక నేనేమీ చెయ్యనులే."

"వాణ్ణి నువ్వేంచేసినా నాకు పోయీ దేమీలేదు. నీకు వొరిగీ దంతకంటే లేదు. కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుంది."

"అది అందరికీ వుండొద్దూ?"

"వుండాలి. లేదు కనకనే ,యిప్పుడు బ్రాహ్మడంటే కంపు కంపు."

"మాట్లాడితే నువ్వు లెక్చరు మొదలుపెడతావు."

"తప్పా? ఇంతకే నీచెల్లెలు రజస్వల అయిందని వాడల్లరిచేస్తే నీకు వచ్చిన నష్టం యేమిటి? వెంటనే దానబ్బసమ్మంధం మరోటి వచ్చిందిగాని పెళ్లి ఆగిపోయిందా? పోనీ, నువ్వు మొదట స్థిరపరిచిన కొంకుదురు సమ్మంధం మహాశాస్త్రీయమైనదేమో అంటే ఆ పెళ్లికొడుక్కి పద్ధెనిమిదో యేటగదా వొడుగయింది? ఈలోపున—"

"చెప్పకురా"

"ఏం? ఇవాళ వెగటుపుట్టిందా?"

"వొరేయ్! ఇక నువ్వు నోరు మూసుకుంటావా లేదా? పేగులు తోడేస్తావేమిటి పిశాచంలాగ?"

"నీకంతకష్టంగా వుంటే పోతానుతే"

"ఈ వుపకారానికి వాడు నీ కేం చేసినా చెయ్యవచ్చు"

"నేను చేసింది వుపకారం అని నీకు బోధపడినప్పుడు అది వాడికిగాక నీకని తెలవకపోవడం ఆశ్చర్యమే!"

"విన్నారా?"

"ఏమిటి?"

"పోనీ తెలిసిందా?"

"ఏమిట్రా అదీ?"

"ఇవాళ శంకరప్పతండ్రితద్దినం"

"అయితే?"

"నిన్నరాత్రి యెనిమిదింటికి ప్రవేశించాడు పిచ్చాయి మేడ మళ్లీ యివాళ వంటలయిపోయా యని కబురుమీద కబురువెళ్లగా యిప్పు డిప్పుడు వచ్చా డివతలికి"

"మీరంతా అంతేగామా? ఇప్పటి కుర్రకారుకి మంచి చెడ్డా యేమేనా వుందా? పుట్టింది బ్రాహ్మణకులం అన్న జ్ఞానం వుందా? వాళ్లని మేశాలకి వెళ్లనివ్వడం లేదుగదా మీరు సరిగ్గాను?"

"పెద్దపెద్దలుమాత్రం—"

"పెద్దలేమిటి చిన్నలేమిటి, చెడ్డపని అన్నప్పుడు అందరిదీ తప్పే కాని వొక్క తేడా వుంది పెద్దవాళ్లు వూరుమాటుమణక్కుండా వాళ్లయింటికి వెళ్లరు తెల్లవారితే అక్కడ వుండరు వ్రతం పాడుచేసుకుంటున్నారు, గాని వాళ్లు కులం చెరుపుకోవడం లేదు మీకు ఆహారపానాలు సాధారణంగా అక్కడేకదా?"

"అదే నేను చెప్పవచ్చేది"

"మాకు తెలవం దేమిటి?"

"ఇది వినాలి"

"కానియ్యి, పోయిం దెమిటి? ఇదివరకి విన్నవాళ్లకంటే చెడ్డది వుండదు"

"బోగందాని చేతి కాఫీ తాగివచ్చాడు వాడు"

"ఇంకా?"

"వుప్మాకూడా తినేవుంటాడు"

"నువ్వు చూడలేదన్నమాట"

"మీ రిలా అంటారని నాకు తెలుసు"

"ఏమనాలో?"

"అలా చేసినవాళ్లందరికీ సమానంగా గడ్డిపెట్టరేం?"

"రుజు వేదీ?"

"నేను చెప్పినదంతా అరణ్యరోదనమే?"

"నువ్వు చూశావా?"

"ఆ"

"మరి తినేవుంటా డన్నావేం?"

"అదిమాత్రం నేను చూడలేదు"

"కాఫీ పుచ్చుకోడం—"

"కళ్లారా చూశాను మామేడవసారాలోనుంచుంటే స్పష్టంగా కనపడుతుంది"

"ఏంజరిగిందో చెప్పు"

"పిచ్చాయితల్లి, వాళ్లు కూచునివున్న గదిలోనుంచి రెండు వెండికప్పులు తెచ్చి వసారాలో కడిగింది"

"అయితే?"

"వొకటి వాడు తాగిందీ, వొకటి అది తాగిందీనీ"

"పోరా!"

"పోనీ, పిచ్చాయి తమలపాకుల చిలకలు వాడినోటి కందిస్తూ వుంటే నేను చూశానండీ!"

"వాడు పట్టే వేస్తాడుకాదూ?"

"

"అది నల్లమందులాంటిది తద్దినం అయేది, చివరికి శ్రాద్ధం అయేది అలవాటయినవాడు మానలేడు"

"ఏమంటారు మీరూ?"

"ఏం వుందీ?"

"మరి నేను సుభద్రాచలం యింటో సగ్గుబియ్యపుపరమాన్నం పుచ్చుకుంటే మీరంత తర్జనభర్జన చేశా రెందుకూ ఆవేళా?"

"నువ్వు ఆపని చేశావుకనక"

"మరి వాడు?"

"సాక్ష్యం?"

“ ప్రతీఅక్షరానికే సాక్ష్యం కావాలంటే సాధ్యమా ? ”

“ లేకపోతే మేమేంచెయ్యమూ ? నువ్వు కోడిబుడ్లు తిన్నావంటాడు వొకడు వచ్చి తగినంత నిదర్శనం లేకుండా నమ్మవలసిందేనా ? ”

“ ”

“ ”

“ నిదర్శనంవున్నవికూడా మీరు వదిలేస్తున్నారు అనేకసంగతులు ”

“ ఏమిటేమిటి ? ”

“ చెప్పమంటారా ? ”

“ వొకటి ”

“ . ”

“ పోనీ రెండు ”

“ ”

“ నాలిక కదలదేం ? ”

“ ”

“ చెవలవాజమ్మా! నోటికివచ్చినట్లల్లా పేల్తావూ ? ”

“ . ”

“ వాడూ నువ్వూ యెక్కడో పోటీలు తగులడ్డారు అక్కడ గుడ్డిగవ్వకి మారలేకపోయావు ఇలా వేస్తున్నావు యెత్తు ”

“ ”

“ అనవసరపు గొడవల్లో దిగక వొళ్లుతెలిసి మసులుకో ”

“ సీతప్పకూతురు బ్రూణహత్య చేసిందా లేదా మొన్నమొన్న ? రామచంద్రుడుకూతురు రంగూన్‌దారి పట్టిందా లేదా ? జోగన్నశాస్త్రి మనమరాలు అత్తింటోనూ కాకుండా, పుట్టింటోనూ కాకుండా—వారంరోజులు మాయమైపోయిందా లేదా ? సాగావధానులుగారి శంభన్న మాలపాలికాపుకి గడ్డిమోపెత్తాడా లేదా ? ”

“ సాక్ష్యం సాక్ష్యం పాడిమాటలు పనికిరావు నాకు ”

“ అలా అయితే రంగూనులో నాలుగేళ్లు జమాబందీ చేసి వచ్చిన వెంకుసోదెమ్మయింటో మీరంతా దేవతార్చన చేశారా లేదా ? ”

“ దానినాలిక తెగ్గొయ్యాం పంచగవ్యాలు పడపోశాం—”

“ తలోవందా కొట్టారు ”

“ అదా నీయేడుపు? మా కా తాహతు వుంది మా కాఅధికారంవుంది మా కాప్రామాణికత్వంవుంది తప్పుచేసినవాళ్లని శిక్షిస్తాం పశ్చాత్తాపపడ్డవాళ్లని ప్రాయశ్చిత్తంచేసి వుద్ధరిస్తాం ”

“ వెళ్లండీ మీనీతులూ మీరూనూ ”

“ మేం కదలం మేం చలించం నువ్వు వెళ్లవలసిందే శీఘ్రంగానూ ”

“ హుం ”

“ పుండాఖోరా! నువ్వు మహాశిష్టాదిగురువుగా యేడుస్తావు
వీళ్లంతా వొక్కతాటిమీదే వున్నారు అప్రాచ్యులు ”

“ ”

“ ఎక్కణ్ణుంచోయ్ ?”

“ పెచ్చాయియింటోనుంచి వస్తున్నాను సూర్యనారాయణ సోమయాజులుగారి శంకరప్ప—”

“ అవునుట ఇప్పుడే చెప్పాడు భాగిన్న ”

“ నిజంచెబుతావా లేదా అని నిలవతీస్తే కాఫీపుచ్చుకోడం నిజమే అంది ”

“ ఇగా వుంది బ్రాహ్మణ్యం ”

“ ఏమిటి చెయ్యడం ? ”

“ తద్దినం పెట్టాడు అంతకే సంతోషిద్దాం మనం ”

“ కాస్తకాస్త మధ్యమధ్య కూకలేస్తూ వుండకపోతే—”

“ చయనం చేసినవాడవు నువ్వే వేశ్యాలోలుడవై యున్నావు గదా—? ”

“ వొదిలేద్దాం ఆ ప్రస్తావన ”

“ ఏం ? ఎందుకు వొదిలెయ్యాలీ ? ”

“ నీకిప్పుడు అవసరం లేదుకనక ”

“ చాలాదూరం వెళ్లింది ఆమాట—ఇక కట్టిపెట్టు ”

“ ఏం ? ఎందుకు కట్టిపెట్టాలీ ? ”

“ ”

“ ”

“ ఇంకేవీ లేవాయేమిటి చెప్పుకోవలసినసంగతులు ? ”

“ ఇవి కాకపోతేగాదూ ? ”

“ అన్నీ వుడిగినవాడితో ఆ ప్రస్తావన లేమిటి పోనిస్తూ ”

“ అలాగేం ? పోనీ, జ్ఞాపకంవస్తే యెంతబాధ కలుగుతుందో పాపం! వెడతాను ”

“ సాయంత్రం వోమాటు కనపడు ”

“ ఆ ”

౬

“ వుసూరుమంటూ వస్తున్నావు ”

“ క్షౌమేస్టేశాదు ”

"ఆ?"

"పైగా ఖర్చులుకూడా ముదరాయిచ్చుకోవాలిట"

"అయ్యో!"

"మిమ్మల్ని నమ్ముకున్నాను--"

"నే నేమేనా అసందర్భాలు చెప్పానా?"

"రామరామా! మీ రెలా చెప్పాలో అలా చెప్పారు నాకోసం మీరు మొదణ్ణుంచి చివరదాకా శుద్ధాబద్ధాలు చెప్పారు --"

"నువ్వొకనక తెలిసిందా? మరొక డిలా చెప్పమంటే గుమ్మంలోకి రానివ్వకపోదును"

"అవునవును నేనెరగనూ? మాఅమ్మ బతికివున్నంతకాలమూ మావ్యవహారాలు మీరే దిద్దారు తరవాత మామామగారు పూనుకోడం చేత నైతేనేమి--"

"ఏమైతేయేమిలే"

"చెప్పవచ్చిం దేమిటంటే? మీ రేమీ లోటుచెయ్యలేదు, కాని—"

"నన్ను బాగా—అంటే నేను చయనం చెయ్యడవే కాకుండా గొప్పవిద్వాంసుణ్ణనీ, కర్మిష్ఠిననీ, ప్రామాణికుణ్ణనీ బాగా యెరుగును పొగడుతాడు ఇంటో కొత్తకుండతడుపుకుంటే నేను వెళ్లాలి నాసాక్ష్యమేనా మంజూరుచెయ్యకుండా—"

"వొక్క సంగతి విన్నాను"

"ఏమని?"

"కనకాచలం వొకరాత్రి మకాంవేసిందని తెలిసింది—"

"అలా చెప్పు"

"రామభద్రచయనులుగారు పురమాయించారుట పాతిక రూపాయ లిచ్చారట్ట వెంకటేశం దానికి"

"జులాయితనంవుంది మనిషిదగ్గిర సందేహం లేదు మున్సబీ అయినాక హెచ్చుకూడా అయిందిట పోనీ నువ్వుకూడా పంపలేక పోయావా యేవెంకటాచలాన్నేనా?"

"తీర్పు చెప్పింతరవాత తెలిసింది ఇంతకీ కొండుశ్రౌతి నిలువునా దగాచేశాడు"

"నేను చెప్పలేదూ వాడు రామభద్రచయనులుతాలూకు మనిషనీ?"

"ఎంతచమత్కారపు రాకడ వచ్చాడో చూశారా? దస్తూరీ తన దేట, కాని సొమ్మివ్వడం తాను చూడలేదుట తనచేత నోటురాయించి, తనయెదటే సాక్షిసంతకాలుచేయించి నోటు నాచేతి కిచ్చి వెంకటేశం నాతోకూడా మాయింటికేసి వచ్చాడుట తన కంతే తెలుసుట"

"సాక్షులుకూడా బాగా దగా చేశారు"

"రాధాకృష్ణమూర్తి కొంతవరకు బాగానే చెప్పాడు గాని-"

"వాడి మొగం నువ్వన్నీ రూపాయలే యిచ్చావనగా వాడు కొన్ని నోట్లుకూడా యిచ్చావన్నాడు ఇక సుందరప్ప సరేసరి!"

"రామభద్రచయనులుగారు నామీద యింతకక్ష కడతా రను కోలేదు చివుకుల రామదీక్షితులునిబట్టి నన్ను దెబ్బచేశా డాయన"

"అసలు తొమ్మిదివందలా?"

"ఫాయిదాతో పదకొండువందల యిరవై దాటాయి వెయ్యి న్నూటపదహార్లు—"

"పెద్దదెబ్బ నీకు"

"రామదీక్షితుఌ మంచి వ్యవహారత అనుకున్నాను, గాని-"

"అధికారి గడ్డితింటే వాడేం చేస్తాడు పాపం?"

"కొండుశ్రౌతి నాదగ్గిర గడ్డి మేసి-"

"తరవాత వాడిదగ్గిర నుగ్గిళ్లు మేశాడు ఇటూ అటూ కూడా కొట్టేసు వాడు గుండేలు తీసినబంటు"

"సూరపరాజుగారిమీదకూడా దావా పడెయ్యాలి చయనులు గారు దానికోకూడా—"

"పూనుకుంటాడు తప్పదు పోనీ నువ్వు అతగాణ్ణి ఆశ్రయించ రాదూ?"

"ఆశ్రయిస్తే రామదీక్షితులుమీద దావా పడెయ్యాలి లేక పోతే నోటు ఆయనికి ట్రాన్సుఫరు చెయ్యాలి ఇందులో యేం చేసినా వాడికి కైదే"

"అదీ నిజమే"

"ఆయన కోటిరెడ్డికికూడా రాయబారాలు పంపుతున్నారుట కానిరోజులు వచ్చిపడ్డాయి కన్ను పొడుచుకున్నా డబ్బుపుట్టక ప్రతివాడూ ఐసుకో, అబద్ధాలకో సిద్ధపడుతున్నాడు అసలికికూడా ఆశవుండేటట్లు కనపడదు"

"భూమి కొనెయ్యరా అంటే విన్నావా?"

"శనిగాడు నెత్తిమీద కూచున్నాడు ఏం చెయ్యనూ?"

"అప్పులు చేస్తావా లేదా?"

"మానడం యెలాగా?"

"ఈమాటు ప్లీడర్ని నేను కుదురుస్తాను నువ్వు తొందర పడకు"

"అలాగే"

౨

"ఏమంటాడు?"

“ వినిపించుకుంటేనా ఏమేనా అనడానికి మానడానికీనీ ? ”

“ . . , ”

“ కొన్ని కొన్ని చిక్కులు చూపించాను చివరికి భయ పెట్టాను ”

“ ఏమనీ ? ”

“ దావాపడితే చాలా నష్టం అనీ, పైగా అప్రతిష్ఠ అనీ ”

“ ”

“ ఏంచేసినా వొకటేమాట “అది నాపెళ్లాంకాదు దాన్ని నేను కోరలేదు నే నంగీకరించలేదు నా కేమీ తెలవనివయస్సులో మావాళ్లు చేసినదానికి నేను బాధ్యుణ్ణికాను—”

“ ఎవరుట బాధ్యులు ? ”

“ తల్లీ తండ్రీనిట ఇవతల మీరుట మీ అమ్మాయికూడా అలాంటి అధికారమే వుందిట మళ్లీ పెళ్లాడవచ్చుట ! ”

“ వాడికి ఘటాశ్రాద్ధంకూడా చెయ్యవచ్చా ? ”

“ . ”

“ గొప్పవిద్వాంసు డవుతాడని యింగ్లండు పంపిస్తే పశువై వచ్చాడు బోలెడుసొమ్ము—”

“ అవునుట ఆమాటకూడా వాడేచెప్పాడు తనకోసం మీ రెంత ఖర్చుపెట్టారో అంతటికీ ప్రస్తుతం నోటు రాసియిస్తాడుట తరవాత రెండేళ్లలో అణాపైసలతో తీర్చేస్తాడుట ”

“ ఆ ? ”

“ ఎంతసేపూ ప్రేమ, ప్రేమ—మరోమాట లేదు ప్రేమ కలగనిచోట పెళ్లేమిటంటాడు వధూవరు లిష్టపడి పెళ్లి చేసుకోవాలి, గాని మధ్య మీరంతా యెవ రన్నాడు ”

“ పోనీ వొకపని చెయ్యమనలేకపోయావా ? ”

“ ఏమి టది ? ”

“ మాపిల్లతో స్నేహం చెయ్యమను త నిక్కడికి వచ్చినా సంతోషమే దాన్ని తనదగ్గిరికి పంపమన్నా సంతోషమే మా కేమీ అభ్యంతరంలేదు ప్రేమ కుదురుకుందా, ఏలుకోవచ్చు అవసరమైతే తనయిష్టంవచ్చినపద్ధతిలో మళ్లీ పెళ్లిచేసుకోవచ్చు ప్రేమ కుదరకూ ? మాపిల్ల మాయింటోనే వుండిపోతుంది ఇంకేమీ మాట్లాడము అదీ, మేమూ మాకర్మానికి యేడుస్తూపడివుంటాము ”

“ ఇంత ఆలోచన తోచలేదు నాకు, కాని మరొకవిధంగా చెప్పాను ”

“ ఎలాగ ? ”

“ దాన్ని రహస్యంగా మాయింటికి తీసుకువస్తాను మీ రిద్దరూ మాట్లాడుకోండి, నచ్చి నీకు దానిమీద ప్రేమకలిగితే తీసుకు వెళ్లు లేకపోతే మానెయ్యి— ”

“ ఏమంటాడు ? ”

“ చదువురాని మూఢురాలితో స్నేహం యేమిటిట ! ”

“ తనచదువు యిలా తగులడుతోంది పోనీ, నాకూతుర్ని ప్రేమించవద్దు దాన్ని తనపెళ్లాంగా భావించవద్దు పెళ్లాంగా మాడ వద్దు తనయింటికి తీసుకుపోతే చాలు దాసీపనులు చేయించుకుంటూ అయినా తనదగ్గిర వుండనిస్తే చాలని యేడుస్తాం దది తాను మరొక దొరసాన్ని పెళ్లాడినా సంతోషమే ”

“ అదీ చెప్పాను అంతఔదార్యం వుండేవాడి కిలాంటిబుద్ధి యెందుకు పుడుతుందీ ? ”

“ ఏం చెప్పాడు ? ”

“ నీకూతుర్ని వాడు ఇటీవల చూడలేదుట, కాని అందం గానే వుండవచ్చుట కనక దాన్ని తనయింటో అట్టే పెట్టుకుంటే నెలో, రెణ్ణెల్లో చూసేటప్పటికి తనమనస్సు చలించవచ్చుట దాని మీద తనకి మోహం కలగవచ్చుట అది పెరిగిపోవచ్చుట స్వాధీనం కాకపోవచ్చుట దాంతో కొన్నిసంవత్సరాలు ఆజంజాటలో పడి వుండిపోవలసివస్తుందిట అది వోపట్టాన వదలదుట ఈసంఘటనవల్ల తనకిక పెళ్లి కాదుట యావజ్జీవమూ యీ మూఢురాలితో వుసూరు మంటూ కడపవలసివస్తుందిట సుఖం వుండదుట ఆనందం వుండదుట శాంతి వుండదుట తన అమూల్యజీవితం దుఃఖభాజనమైపోతుందిట!”

“ అబ్బా ! ”

“ ఎంత గడుస్తనంగా— ”

“ ఇంతకీ ఈతప్పంతా నాగి ”

“ ”

“ చిన్నతనంలో చురుగ్గా వుండడం చూసి నేనే యింగ్లీషులో ప్రవేశపెట్టమని సలహాచెప్పాను తరవాత ఆస్తి తక్కువైనా పిల్ల నిచ్చాను ప్రొఫెసర్లంతా మంచి తెలివైనవాడని పొగడితే యింగ్లం డు పంపించాను సొమ్మూ పోయింది, దిమ్మూ పట్టింది ”

“ ”

“ నేను చేసినదానికి శిక్షకూడా నాకే అయితే బాగుండిపోను మా అమ్మాయి గొంతుకోసినట్టయింది దాన్నిచూస్తే కడుపు చెరవైపోతోంది ”

“ పైవాళ్లే చూడలేకుండా వున్నారు ”

“ ఇంకోటిచూడూ ప్రేమ ప్రేమ అంటూ అంత గుంజు కుంటాడు గదా ? నిజంగా ప్రేమవున్నవాడయితే యింత మొండి కత్తగలడా ? ప్రేమ హృదయాన్ని మృదువుపరుస్తుందా, రాయిగా చేస్తుందా ? తాను ప్రేమ కలవాడే అయితే నాకూతురుస్థితికి జాలి కలక్కుండా వుంటుందా ? ”

"నిజమే, ప్రేమవున్నచోట యింత కాఠిన్యంవుండడం అసహజం"

"కనక వాడికి నిజంగా ప్రేమించడం తెలవదు ఎవర్తిమీదో కన్నువేశాడు అది వీణ్ణి యింకా లక్ష్యపెట్టడంలేదు దాన్ని మరిచిపోలేడు దీన్ని సుఖపడనివ్వడు ఇలాంటివాళ్ళకి చివరి కెలాంటిగతి పడుతుందో యెరుగుదువా ?"

"ఆశ్చర్యమా ?"

"ఇలాచూస్తే బ్రాహ్మణలక్షణమూ లేదు అలాచూస్తే ప్రేమికుని లక్షణమూ లేదు చివరికి మనిషి అనికూడా చెప్పడానికివీల్లేదు"

"ఇంతకీ ఇంగ్లీషు మన కొంపకొల్లేస్తోంది"

"అది తెలివితక్కువమాట ఆచారాల్లోనూ, నడతలోనూ భేదం కలిగించవచ్చు ధర్మంలోనూ, నీతిలోనూ కొత్తదారి తొక్కించవచ్చు హిందువుగా పుట్టినవాణ్ణి క్రిస్టియనుగా మారిస్తే మార్చవచ్చు, గాని పెళ్లామనీ, బిడ్డలనీ, సంసారమనీ తెలవకుండా చేస్తుందా యింగ్లీషు ?"

"ఏమో! నాకు—"

"అలాకాదు, కాని వొక తెలివితక్కువ పనిమాత్రంచేస్తున్నాం మనం ఇంగ్లీషు చదువుకున్నవాళ్ళకి ఆడాళ్లుకూడా చదువుకోవాలని వుంటుంది మనం మొగపిల్లలికి యింగ్లీషుచెప్పించి వూరుకుంటున్నాం గాని ఆడపిల్లలికూడా చెప్పిస్తే యీ కుర్రకారురోగం చప్పగా కుదురుతుంది"

"అది మరీ—"

"చివరికంటా విను ఇంగ్లీషు మొగపిల్లలికి పడమటిచూపు కలిగిస్తోంది ఆడపిల్లల చూపు తూర్పుకే వుండిపోతోంది దీనితో—"

"కాని ఆడపిల్లలికికూడా యింగ్లీషు అలవాటుచేస్తే మన సంప్రదాయాలు నిమిషంలో గంగలో కలుస్తాయి"

"అది నిజమే, కాని యీవుప్పెనచూశేవా ?"

"ఏంచెయ్యడానికీ తోచదు"

"కానియ్యి ఇంకా యెంతకాలం యిలా యేడవాలో మాపిల్ల వొక్కపిల్ల పైగా వజ్రపుతునక ఎన్నిముచ్చట్లు తీర్చుకోవాలని ఆశపడ్డామురా దీనిమూలంగానూ ? ఎంతవిఘాతం"

"అదేమిట్రా ?"

" "

"ఛా! ఆడదానిలాగ—"

"ఆడదానికేగాని మొగాడికి దుఃఖం వుండదూ ? పదిహేడేళ్లు వెళ్లాయి దాన్ని చూస్తూ యెలాగ భరించడం ? దానికి గతి యేమిటి ? పురిట్లో వొకసాడు ఆశవదులుకున్నాం అప్పుడే పోయి వుంటే యింతకోత లేకపోవును మాకు వొకొక్కప్పుడు దాన్ని కిరస్తానీలలో కలిపేసి— మేంకూడా కలిసిపోయి మరొకడికి పెళ్లి చేసేద్దామా అన్నంత వుద్రేకం కలుగుతూవస్తుంది కాని వాడు దారికి రాకపోతాడా అని ఆశపుడుతూవుంటుంది చూడూ ఇంతవూరుంది నూరిళ్ల బ్రాహ్మణాగ్రహారం అంతా పండితుల్లోనే జమ అంతా కర్మిష్ఠుల్లోనే లెక్క మాట్లాడితే ప్రాయశ్చిత్తా లంటారు, కాని వాడికి గడ్డిపెట్టరేం ? మాపిల్లకి మళ్లీ పెళ్లిచేస్తే—"

"ఇక తరవాయా ? అవి కారికలు కావు, అవిసభలు కావు, అవి చర్చలుకావు, అవి తీర్మానములుకావు, అవిబహిష్కారాలు కావు—"

"ఛీ! ఏంజాతిరా మనదీ ?"

౮

" నూతినీళ్లుకాబోలు"

"అవునండి"

"చాలా బాగున్నాయి ఈమధ్య తమయింటో శుభకార్యం యేమేనా జరిగిందా ?"

"మాచెల్లెలిపెళ్లి చేశాం అందుకోసమే యీపందిరి వేశామండి"

"బాగుంది . మీయింటిపేరు ?"

"చావలివారు"

"నామధేయం ?"

"వేంకటావధాని"

"మీ రేం అధ్యయనంచేశారు ?"

"అన్నీ అయినాయి—"

"ఏమేమిటి ?"

"మొదట సంహితఅంతా అయిపోయింది తరవాత పరాయతం పూర్తిచేశాను స్మార్తం అయిందనిపించాను చివరికి పంచకావ్యాలుకూడా పాడేశాను, కాని—"

"ఇంకా కానీయేం ?"

"వాట్లవల్ల యేమీ లాభం లేకపోగా స్కూలు మాస్టరుగా ప్రవేశించాను"

"ఇంగ్లీషుకూడా—"

"తెనుగే చదవలేదూ నాలుగోక్లాసు ఇనస్పెక్టరుగారి నాశ్రయించగా నా చిన్నతనంలో తారీఖువేసి ప్రయిమరీ సర్టిఫికెట్టు దయచేశారు ట్రెయినింగుకికూడా వారే—"

"తాంబూలం యేమాత్రం—?"

"ఇంటర్మీడియట్ట్టిందే పడమటావుపెయ్య, తొలిచూలుది వుండగా తోలిపెట్టాను నూటపాతికరూపాయలికి తరిమితరిమి అడిగారు వేరగాళ్లు దాన్ని."

"బాగుంది ఇహంలో భుక్తికి దారి పరంలో— అయితే, ఆయన బ్రాహ్మడేనా?"

"మనవాడే చేబియ్యంవారు"

"అయితే, పరంలో ముక్తికి సోపానం కిరీటంలేని రాజన్నట్లు ధారపొయ్యనిదానం"

"చిత్తం, చిత్తం"

"జీతం యెంత?"

"పదిహేడిస్తారిప్పుడు"

"అంతేనా?"

"అదేనా కడిగేసి"

"పైగా—వూళ్లో—"

"అవి పూర్వపుమాటలు ఇప్పుడు దమ్మిడీకూడా ముట్టదు గిలకలు పట్టిస్తామంటే సగం గుమాస్తాలకి దాఖలుచెయ్యాలి ఆపైని ఇనస్పెక్టరుగారికి విందుచెయ్యాలి ఇప్పటి ఆయనికి లంచా లక్కరలేదు, కాని పిండివంటలతో భోజనాలూ, టీపార్టీలూ—"

"మొత్తానికి మనలో మనమాట ఇప్పుడు చదువులూ ఆలాగే వున్నాయి"

"నిజమే మీదగ్గిర దాచడం యెందుకు? జోర్డువా రొకందుకు పారశాలలు నడుపుతున్నారు మే మొకందుకు మేష్టరీ చేస్తున్నాం తల్లిదండ్రులు లొకందుకు పిల్లల్ని పంపుతున్నారు పిల్లలు మరొకందుకు వస్తున్నారు"

"సరిగా చెప్పారు అందరికీ కాలం గడిచిపోతోంది"

"కాని దీల్లోకూడా వుచ్చులు బిగుస్తున్నాయి బ్రహ్మిగాళ్లకి ట్రెయినింగుఅళ లేదిప్పుడు చేర్చుకోవడం లేదు"

"అదోటికూడానా? అయితే చిక్కే మీకు సంతానం"

"ఇద్దరు కొడుకులతరవాత వొకకూతురు పెద్దవాకి మొన్ననే మాచెల్లెలిపెళ్లిలో వొకపోచ వేశాను"

"మీచెల్లెలి నేవూరిచ్చారు?"

"ఇక్కడే పులుగుర్త కల్లూరివారి అబ్బాయి ఫోర్తుఫారం చదివి, ట్రెయినింగు కానిచ్చేశాడు; కాని యింకా మేష్టరీ దొరకలేదు అక్టింగులు—"

"కట్నం యేమాత్రం యిచ్చారు?"

"రెండువందలు కరుకులు గుమ్మరించాను పైగా లాంఛనాలు—"

"రెండో మూడో వందలు చెప్పేదేమిటి? ఇదంతా—"

"పొలం తనఖాపెట్టానండీ!"

"ఊహూ? అద్ది'వొదిలేటప్పటికి మరొకటి తగులుకుంటుంది"

"వొదిలేదాకా వుంటే అదీ వొకఅందమే మీదటికి నాలుగో చెల్లెలికి పెళ్లి చెయ్యాలి అదలావుండగా మాపెద్దకుర్రవాడికి సమ్మంధాలు వస్తున్నాయి నలుగురైదుగురు కొందరచేస్తున్నారు"

"కట్నం యేమాత్రం యేర్పరిచారు"

"అయిదువందలికి గుడ్డిగవ్వ తగ్గితే మాట్లాడ నక్కరలేదు"

"పైగా లాంఛనా లివ్వాలి బాగావుంది"

"వుభయఖర్చులూ పెట్టుకోవా లందా మనుకుంటున్నాను"

"ఆలోచన యెందుకూ?"

"ఆలోచనే లేదు అనేవేశాను—"

"తమకి వసతి యేమాత్రం వుందండి?"

"నలుగురం పంచుకోవాలి, కాని నాసంగతి—మా అత్తవారు సాయం—"

"ఇంకేం? అగి అనేకవిధాల కాపుదల సమష్టికుటుంబంలో ఆమాత్రం ఆధారంవున్నవాడు చులాగ్గా తేలిపోతాడు"

"వొకాయన దానికూడా సిద్ధపడుతున్నాడు, కాని పిల్లతాత—పితామహుడు గంగాధరత్వం—"

"ఆ? కొట్టిందాయేమిటి?"

"ఇంతకీ ఆయన పోయి పాతిక్కేళ్లయింది పిల్లతండ్రి చిన్నతనంలో వారసత్వం నిలిపా డంటారు, గాని యిప్పుడు వడ్డీ వ్యాపారం చేస్తున్నాడు"

"ఇప్పుడు బcగారపుపిచికేగదా? పోనివ్వకండి" —

"తాంబూలాలు పుచ్చుకోడం తరవాయి"

"భేషుగ్గావుంది"

"మరి తమరు పొద్దుండగా—"

"ఈవూరే వచ్చాను ఆవీథికి వెళ్లి భోజనంసంగతి చూస్తాను లెండి మాచుట్టాలయింట్లో పెళ్లి బోగంమేళం కావాలి ఈరాత్రే మాట్లాడుకొని తెల్లవారగట్ల కూడా తీసుకుపోవాలి"

"కవలిస్తే పేరుపడ్డ నాయకురాలు నేను చెబితే వినేదుంది కబురంపుతాను భోజనంచేసి దయచెయ్యండి"

"తమకి అలాంటి అలవాటుకూడా వుంటే చాలామంచిదే, మరి సెలవూ."

"చిత్తం పెద్దవేమూరివారియింటికి వెడితే మీకు భోజనం దగ్గరగా—ఇవాళ వారియింటో నామకరణంకూడా అయింది నేనుచెప్పిన నాయకురాలు మేజువాణీచేసింది వారియింటోను వారి నడిగితే దాని సంగతి మీకు తెలుస్తుంది"

"చిత్తం"

"మీరు వచ్చేటప్పటికి కబురుపంపి రప్పించమంటారా?"

"నేను వచ్చాక—"

"అప్పటికి దానికి యిల్లు కదలడానికి వీలవుతుందో కాదో? ఈలోపుగా కబురువెడితే మంచిదీ"

"దానిపే రెవరండి?"

"పుదేనాపువ్వుఅని దానికి మారుపేరు మంచి చురుకైనపిల్ల"

"దానికోసమే నాప్రయత్నం అయినా నేను వచ్చేదాకా మీకు శ్రమపడవద్దు"

"మీరే దానియింటికి వెడతారా?"

"కొంచెం పరిచయం వుందండి"

"సరిసరి ఇంకేం? మహాబాగావుంది"

సీ॥ జోటుపై నిది బ్రాహ్మణాగ్రహారమునకు;
వివిధప్రవృత్తుల, వివిధగతుల
ఛాయ లేగాని అసత్యముల్ లే విందు,
పెంచను లేదు, కుదించ లేదు;
ఆత్మవృత్తము వాఙ్మయాదర్శమునయందు
తనరూపు మించుటద్దమునతోచు
న ట్లవగాహనమ్మగునంచు కూర్చితి
భిన్నస్థలమ్ముల వృత్త మొకటి;
ఋషులు తీర్చిన ధర్మప్రవృత్తి యిదియె?
బ్రాహ్మణుని బ్రతుకేమికావలయు ముందు?
ఉడికిన ఫలమ్ములే, దూరకుండగాదు,
దిద్దుకొనుట యొక్కటె మంచి తెరువు సేఁసు



తేయాకు ఫ్యాక్టొరి, నీలగిరి

—యస్. మీనాక్షిసుందరము